నవతెలంగాణ
వరంగల్
శనివారం | జూన్ 8, 2024 | www.navatelangana.com

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సర్వం సిద్ధం

అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నవతెలంగాణ-వరంగల్

ఈ నెల 9 న జరిగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అంకితభావంతో కషి చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి అధికారులను ఆదేశిం చారు. శు క్రవారం జిల్లా కాలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శాఖల అధికారులు, రూట్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులతో జరిగిన సమావేశంలో పరీక్షల సమర్ధ నిర్వహణకు అదనపు కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని అన్నారు. జిల్లా నుండి గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవు తున్న 9092 మంది అభ్యర్థుల కొరకు 17 కేంద్రాల లో కనీస సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. 17 మంది డిపా ర్ట్మెంటల్ అధికారులు, 25 పర్యవేక్ష కులు,5 రూట్ ఆఫసిర్లను నియమించినట్లు తెలి పారు. పరీక్ష పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధిస్తున్నామని, పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపర్డెంట్ అబ్జర్వర్, ఇన్వి జిలేటర్, బయోమెట్రిక్ ఇన్విజిలే టర్లు, ఆశా ఏఎన్ఎం, సెల్ఫోన్ స్టోరేజ్ స్టాప్ తప్ప ఇతర వ్యక్తులు పరీక్ష పరిసర ప్రాంతాల్లో ఉండకూడదని తెలిపారు. ఈ సమావేశంలో పరీక్షల రీజనల్ కోఆర్డినే టర్ ప్రొఫెసర్ చంద్రమౌళి పాల్గొన్నారు.





కార్మికుల సంక్షేమ సెస్‌ను చెల్లించాలి

జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్

ప్రభుత్వ శాఖల ద్వారా జరిగే భవన నిర్మాణాలకు తప్పకుండా కార్మికుల సంక్షేమ సెస్‌ను చెల్లించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు చేపట్టే సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు భవనాలు, ఇతర నిర్మాణాల చట్టం 1996 ప్రకారం నిర్మాణ వ్యయంలో ఒక శాతం సెస్‌ను విధిగా తీసి సంబంధిత కార్మిక శాఖకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, జాయింట్ కమిషనర్ సునీత, డీటీసీపీ రత్నకుమారి, ఆర్ అండ్‌బీ అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో రాంరెడ్డి, గనుల శాఖ ఏడీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అన్వేష్

నవతెలంగాణ- కాశిబుగ్గ

కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన కట్కూరి అన్వేష్ నియమితులయ్యారు. శుక్రవారం ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్వేష్‌కు నియామక ఉత్తర్వులు అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎర్రం కమల్, కాంగ్రెస్ నాయకులు గుడా శారదా, లావణ్య, గొల్లపల్లి రామకష్ణ, కొండమిది సదానందం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రానికి చెందిన పల్లకొండ ఐలయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు ఆదర్శ కాలనీవాసులు శు క్రవారం ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పరామర్శించి క్వింటాల్ బియ్యంతో పాటు ఇతర రూ.10వేల విలువ చేసే వంట సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఇళ్ల సూరయ్య, గోడిశాల సురేందర్‌గౌడ్, కాలె రాములు, కోరె రవి, ముదురు రమేష్, కంది నారాయణరెడ్డి, ఎర్ర రవీందర్, పులి రమేష్ కుసుమ సారంగం, ప్రసాద్, ఆరె శివయ్య, ముత్యం రాజు, నరిగె రవి, నరిగె శివరాజు పాల్గొన్నారు.

నేడే లోక్ అదాలత్ నిర్వహణ

నవతెలంగాణ-వరంగల్

లోక్ అదాలత్‌ను నేడు ఉదయం 10గంటలకు వరంగల్, హన్మకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, వరంగల్ చైర్మన్స్ బీవీ నిర్మలా గీతాంబ, రమేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



భద్రకాళి గుడిని సందర్శించిన మంత్రి 'కొండా'

నవతెలంగాణ-వరంగల్

వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవాలయాన్ని అటవీ, పర్యావరణ, దేవా దాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం సంద ర్శించారు. మంత్రి కొండా సురేఖకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆమెకు దేవాదాలయ అధికారులు జ్ఞాపికను బహూ కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దళిత స్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్ నర్సంపేట రోడ్డులోని దళిత స్మశాన వాటికలో శుక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్మశానవాటిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జన్ను స్కైలాబ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో దళిత స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో శుక్రవారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండీ ఫుర్కాన్, స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు జన్ను ప్రమోద్, చుంచు కృష్ణ, పీడికల శ్రీహరి, ఆకినపల్లి బాబు, వేల్పుకొండ రాజు, జన్ను రాజ్‌పాల్ పాల్గొన్నారు.

'తీన్మార్' గెలుపు లాంఛనమేనా..

ఆధిక్యంలో కొనసాగింపు

ఎలిమినేషన్‌లో బీజేపీ అభ్యర్థి

20వేల మెజార్టీ వచ్చే అవకాశం..?

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు లాంఛనమేనని భావిస్తున్నారు. సుమారు 20 వేల మెజార్టీతో గెలిచే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. శు క్రవారం సాయంత్రానికి ఎలిమినేషన్ ప్రక్రియలో ఇండిపెండెంట్ అశోక్ గౌడ్‌కు వచ్చిన రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కించి అశోక్‌ను ఎలిమినేట్ చేశారు. ఇక బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి వచ్చిన 43 వేల 712 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. ఈ లెక్కింపులో ఇప్పటికే ఆధిక్యతలో కొనసాగుతున్న తీన్మార్ మల్లన్నకు మరింత మెజార్టీ పెరిగి గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1,55,095 ఓట్లు ఎవరు సాధిస్తే వారినే విజేతలుగా ప్రకటిస్తారు. విజయం సాధించాలంటే 'తీన్మార్'కు 31 వేల 386 ఓట్లు కావాల్సి వుంది. బిఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 50 వేల 249 ఓట్లు అవసరముంది. 'గుజ్జుల' ఓట్లు కేవలం 43 వేల 712 మాత్రమే కావడంతో రాకేశ్ గెలవడానికి అవకాశం లేదు. దీంతో ఎట్టకేలకు 'తీన్మార్'నే విజయం వరించనుంది. శుక్రవారం రాత్రి 'తీన్మార్' గెలుపును లాంఛనంగా ప్రకటించే అవకాశముంది.

నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3 లక్షల 63 వేల 839 ఓట్లుండగా, కేవలం 3 లక్షల 36 వేల 13 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. శుక్రవారం సాయంత్రం నాటికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,23,873 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి ఎనుగుల రాకేశ్ రెడ్డికి 1,04,990, బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి 43,797 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్ అశోక్ గౌడ్‌కు 29,948 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో 50 శాతం ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను గురువారం రాత్రి ప్రారంభించి, శుక్రవారం సాయంత్రం నాటికి 42 మందిని ఎలిమినేషన్ రౌండ్‌లో వారి రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కించి ఎలిమినేట్ చేశారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే సుమారు 25 వేలకుపై ఓట్లు చెల్లకుండా పోవడం గమనార్హం. దీంతో అభ్యర్థులు, అధికారులకు ఉత్కంఠ నెలకొంది.



ఉత్కంఠభరితంగా ఓట్ల లెక్కింపు

పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రధానంగా మూడు పార్టీల మధ్యే పోటీ వుంటుందని భావించినా, స్వతంత్ర అభ్యర్థి అశోక్ గౌడ్ మొదటి ప్రాధాన్యత ఓట్లను గణనీయంగా చీల్చడం గమనార్హం. శుక్రవారం సాయంత్రానికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 18వేల863ఓట్ల మెజార్టీతో ముందుకు దూసుకుపోతున్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి 42 మందిని ఎలిమినేట్ చేశారు. వారికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధా న్యతా ఓట్లను వారి వారి ఖాతాలో జమ చేశారు. తాజాగా బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి వచ్చిన 43 వేల ఓట్లను లెక్కించే ప్రక్రియ కొనసాగుతుంది. ఇందులో రెండో ప్రాధా న్యతా ఓట్లను తీన్మార్ మల్లన్న, ఎనుగుల రాకేశ రెడ్డిలకు పంచుతారు.

'తీన్మార్'కు 20 వేల ఓట్ల ఆధిక్యం

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సుమారు 20వేల మెజార్టీతో గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి వచ్చిన ఓట్లలో 31 వేల 386 ఓట్లు వస్తే 'తీన్మార్' గెలుపును లాంఛనంగా ప్రకటిస్తారు. బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50 వేల 249 ఓట్లు అవసరం. ప్రేమేందర్‌రెడ్డికి వచ్చిన ఓట్లు కేవలం 43 వేలు మాత్రమే కావడంతో రాకేష్‌రెడ్డి గెలిచే అవకాశాలు లేనట్టే

మొదటి ప్రాధాన్యత ఆధిక్యమే ..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యతా ఓట్లలో వచ్చిన 18 వేల ఆధిక్యతే ఆయన విజయంలో కీలకంగా మారింది. 25 వేల ఓట్లు చెల్లకపోయి వుంటే మొదటి ప్రాధాన్యత ఓట్లలో మరింత మెజార్టీని 'తీన్మార్' సాధించే అవకాశం వుండేది. ఎలిమినేషన్ ప్రక్రియలో ఇప్పటి వరకు 42మంది ఓట్లలో రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కించి వారిని ఎలిమినేట్ చేశారు. తాజాగా బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10-11గంటల వరకు లెక్కింపు పూర్తయ్యే అవకాశముందని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు లాంఛనమేనని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



మీ సేవా కేంద్రాల్లో

అధిక రుసుము వసూళ్లు చేస్తే చర్యలు

నవతెలంగాణ -నర్సంపేట

మీ సేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుముకు మించి వసూళ్లు చేస్తే చర్యలు తీసుకొంటామని ఈడీఎం రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణం, మండలంలోని మీ సేవా కేంద్రాల్లో అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని అనే సమా చారంతో మీ సేవా సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీసేవ సెంటర్స్‌లో రేట్స్ చార్ట్, లోగో, మీసేవ కాల్ సెంటర్ నెంబర్, తహసీల్దార్, ఈడీఎం, డీఎం ఫోన్ నెంబర్లు తూచ తప్పకుండా బోర్డులపై రాయించాలన్నారు. అధిక రుసుము వసూళ్లు చేస్తే దరఖాస్తుదారులు ఈ ఫోన్ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. అధిక మొత్తం వసూలు చేసినా, మీసేవ సెంటర్ ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి మార్చినా సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీస ుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ తనిఖీల్లో డీఎం యుగేందర్ పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న మహిళా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్

నవతెలంగాణ-వరంగల్

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి మహిళా రోగులను లక్ష్యంగా చేసుకొని గొలుసు చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగను మట్టెవాడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మహిళా కిలాడీ నుండి పోలీసులు రెండు లక్షల యాభై వేల రూపాయల విలువైన 35గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్‌కు సంబంధించి వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా ముల్కనూర్‌కు చెందిన తురసటి శారద సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో చికిత్స కోసం ఒంటరిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి రోగులతో పరిచయం పెంచుకొని వారితో చనువుగా ఉంటూ సదరు మహిళా రోగులను నిందితురాలు నిర్మానుష్యమైన ప్రదేశాలకు తీసుకెళ్లి బెదిరించి, కొట్టి వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల చోరీకి పాల్పడేది. ఇదే తరహాలో నిందితురాలు గత నెల 28న చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చిన మహిళా రోగి వద్ద బంగారు గొలుసును చోరీ చేసిందని తెలిపారు. ఈ సంఘటనపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితురాలిని గుర్తించినట్లు చెప్పారు. నిందితురాలు మరో



మారు చోరీ చేసేందుకు ఎంజీఎంకు వచ్చినట్లు తెలుసుకున్న ఎస్సై విఠల్‌రావు తన సిబ్బందితో వెళ్లి మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నిందితురాలు నేరాన్ని అంగీకరించడంతో పాటు గతంలో ఎల్కతుర్తి, హుజురాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లుగా అంగీకరించింది. ఆమె ఇచ్చిన సమాచారంతో చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకొని మహిళా దొంగను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తర లించారు. నిందితురాలిని పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్ఐ విఠల్, కానిస్టేబుళ్లుఆలీ, హరికాంత్, రాజేందర్, మహిళా కానిస్టేబుల్ రమ్యను వరంగల్ ఏసీపీ అభినందించారు.



అధికారుల నిర్లక్ష్యం వల్లే దెబ్బ తింటున్న పంటలు

ఆందోళనలో ఆయకట్టు రైతులు

నవతెలంగాణ-పర్వతగిరి

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమ పంట పొలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్ వద్ద పర్వతగిరికి చెందిన దళిత రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. రిజర్వాయర్‌కు ఉన్న రెండు తూములకు షట్టర్లను ఇరిగేషన్ అధికారులు సరిగా ఫిటింగ్ చేయక పోవడంతో తాము మూడేండ్లుగా పంటలు పండించుకోకుండా ఉన్నామని వాపోయారు. 24గంటలు ఈ తూములలో నుంచి నీరు బయటకు వచ్చి తమ పంట పొలాల మీదుగా వెళుతున్నాయని, దీంతో పంటలు వేసుకోలేని దుస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతులు బొట్ల వెంకన్న, అర్షమ్ జయమ్మ, కాసర్ల ప్రభాకర్, బొట్ల పుష్పమ్మ సింగారపు యాకయ్య, చేరాలు, దర్గయ్య, కనుక రాజు తదితరులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు తూ ములను సరి చేస్తే వానా కాలం పంటలు పండించు కుంటామని కోరుతున్నారు. తూము వద్ద నుంచి పూలకమ్మ చెరువు వరకు సీసీతో కాలువ నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

మాల్దీవుల కౌన్సిల్ సభ్యుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

ఈ నెల 17నుంచి మూడ్రోజుల పాటు పర్యటన

నవతెలంగాణ-వరంగల్

మాల్దీవుల కౌన్సిల్ సభ్యుల పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమిషనర్ పాల్గొని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ అవలంబిస్తున్న పారి శుధ్య విధానాల అధ్యయనం క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు బల్దియా అవలంభిస్తున్న పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మోడల్ వైకుంఠదామ సందర్శన, ఎఫ్ఎస్‌టీపీ, ఎస్టీపీ కేంద్రాల పర్యటన, బయో మైనింగ్ విధాన పరిశీలన కార్యక్రమాల్లో పాల్గొనడానికి మాల్దీవుల దేశానికి చెందిన పలువురు కౌన్సిల్ సభ్యులు ఈ నెల 17నుంచి 19 వరకు మూడు రోజులు నగరంలో



పర్యటించనున్నారని తెలిపారు. ఇందుకోసం విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ కష్ణరావు, బల్దియా ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, హెచ్‌ఓ రమేష్, ఈఈ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా వ్యాప్తంగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

నవతెలంగాణ-వరంగల్

బల్దియా వ్యాప్తంగా 66డివిజన్లలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే సందర్భంగా దోమల నివారణ చర్యలు చేపట్టినట్టు జీడబ్ల్యుఎంసీ బయాలజిస్ట్ మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 10వారాలు దోమ లార్వాలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మలేరియా ఫీల్డ్ వర్కర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇండ్లలో నిలువ ఉన్న నీటిని తొలగించడంతో పాటు నీరు నిల్వవున్న మురికి కుంటల్లో, ఓపెన్ ప్లాట్స్, నీరు నిల్వ ఉన్న గుంటల్లో సుమారు 360ఆయిల్ బాల్స్‌ను వేశారు. దీంతో పాటు ఎంఎల్ఓ ఆయిల్



క్రోమోపాస్‌ను పిచికారి చేసినట్టు బయాలజిస్ట్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు బలభద్ర రవి, మధుకర్, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్, ప్రకాష్, సంపత్, శ్యాం, శివకుమార్, శ్రవణ్‌కుమార్, మల్లేశం, శ్రీనివాస్, అజీ, పాశం రవి, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ రుణ ప్రణాళిక ప్రకటించాలి

నవతెలంగాణ-నర్సంపేట

రైతాంగ సమస్యల పరిష్కారానికి సమగ్ర వ్యవసాయ పంటల రుణ ప్రణాళికలను తక్షణమే ప్రకటించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వసుకుల మట్టయ్య అధ్యక్షతన పట్టణంలోని ఓంకార్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమై రైతులు విత్తనాలు విత్తడానికి సిద్ధమైన ఇంతవరకు వ్యవసాయ శాఖ సమగ్రమైన అంచనాతో రైతులకు కావలసిన విత్తనాలు ఎరువులు రుణాలు యంత్రాలు సమకూర్చకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మరోవైపు విత్తన కంపెనీ యజమానులు వ్యాపారులు దళారులు కుమ్మక్కై రైతుల విత్తన అవసరాలను అమాయకత్వాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా రెట్టింపు ధరలతో రైతులకు విత్తనాలను విక్రయిస్తున్న అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలతో కాలం వెలుబుచ్చుతున్నారన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించి పంట రుణాలు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సమగ్ర భూ సర్వే నిర్వహించి రైతులు ఆధీనంలోని భూములను రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి దశల వారి ఆందోళన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుండెబోయిన చంద్రయ్య, కుసుంబ బాబురావు, మహమ్మద్, ఇస్మాయిల్, మోహన్ పాల్గొన్నారు.

వరంగల్ ప్రజల గొంతుగా నిలుస్తా : ఎంపీ డాక్టర్ కడియం కావ్య



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

పార్లమెంటులో వరంగల్ ప్రజల గొంతుకనై నిలుస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని ఎంపీగా గెలిచిన కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి ఎన్నికల్లో సహకరించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం పీ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో కమ్యూనిస్టు శ్రేణులు గెలిపించారన్నారు. తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సీపీఐ కార్యకర్తలు భారీమెజారిటీతో గెలిపించినందుకు వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. పార్లమెంటులో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో పేదలు, గుడిసె వాసులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మట్టికరిపించేందుకు కార్యకర్తలు కృషి చేశారన్నారు. పార్లమెంటు లో ఈ ప్రాంత సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, పి. సుగుణమ్మ, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే.బాషుమియా, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధర్మసాగర్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ కోరారు. శుక్రవారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీని కోరారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డుకి కార్మికుడినే చైర్మన్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఆర్‌కేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు రవి, మల్లంపల్లి ఎంపీటీసీ బింరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింగారపు రమేష్,మాజీ సర్పంచ్ నరబోయిన ఎల్లాస్వామి, గిన్నారపు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నడికుడలోనే పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నడికూడ

నడికుడ మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీని తరలించకుండా ఇక్కడే ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడానికి నాటి ఎమ్మెల్యే ధర్మారెడ్డి పీహెచ్‌సీని మంజూరు చేయించారని కానీ నేడు కాంగ్రెస్ నాయకులు మరో ప్రాంతానికి తరలించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో పి హెచ్‌సీ ఏర్పాటుతో 14 గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు, ప్రాథమిక చికిత్సలు అందుతాయన్నారు.

ఈనెల 9 నుండి నాటకోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 15వ ఉభయ రాష్ట్రాల తెలుగు ఆహ్వాన నాటిక పోటీలను ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లాఅధ్యక్షులు కాజీపేట తిరుమలయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోతన విజ్ఞాన పీఠం వరంగల్ వేదికగా ప్రారంభించబోతున్న ఈ పోటీల్లో ఆంధ్ర ప్రాంతం నుండి మూడు, తెలంగాణ ప్రాంతం నుండి మూడు మొత్తం ఆరు నాటికలు ప్రతిరోజు రెండు చొప్పున ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, దాతలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంఎస్ఆర్.మూర్తి, ఉపాధ్యక్షులు కళా రాజేశ్వరరావు, ఇంటర్నల్ ఆడిటర్ వేముల ప్రభాకర్, కార్యదర్శులు ఆకుతోట లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు కుసుమ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డాక్టర్ కావ్యను కలిసిన ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-ఆత్మకూరు

వరంగల్ ఎంపీ కడియం కావ్యను శుక్రవారం ఆత్మ కూరు జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ తదితర ప్ర జా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలి సి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ఎంపీ కోటా ద్వారా ప్రత్యేక నిధులు విధులు చేయాలని, మండలంపై ప్రత్యేక దృష్టిసా రించి అభివద్ధికి సహకరించాలని కోరారు. మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి మీ వంతు సహకారం కావాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు అర్షం వరుణ్‌గాంధీ, బొమ్మగానీ భాగ్య రవి, పెద్దాపూర్ సొసైటీ వైస్ చైర్మన్ అంబటి రామస్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అన్వేష్



నవతెలంగాణ-కాశిబుగ్గ

కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన కట్కూరి అన్వేష్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్వేష్ కు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎర్రం కమల్, గుడా శారదా, లావణ్య, గొల్లపల్లి రామకృష్ణ, కొండమిది సదానందం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

11న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా



నవతెలంగాణ-సుబేదారి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల11న ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేలా నిర్వహించడం జరుగుతుందని డీఫార్మసీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన 18 నుండి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతి, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11 వేల నుండి రూ.25వేల వరకు వేతనం చెల్లిస్తారని అర్హత, ఆసక్తి గల యువత విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఈనెల 11న ఉదయం 11గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు నెం. 8247656356, 9848895937 లో సంప్రదించాలని మల్లయ్య తెలిపారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-సుబేదారి

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్లో రెండేళ్ల కోర్సు(2024-26)లో చేరేందుకు ప్రవేశ పరీక్ష డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైందని హనుమకొండ డిఈఓ ఎండి. అబ్దుల్ హై తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ శనివారం నుంచి ఈనెల 30 వరకు deecet.cdse వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్ ఎగ్జామ్ జులై 10న జరగనుందని డిఈఓ తెలిపారు.

అంతిమ విజయం ఇండియా కూటమిదే

- రాహుల్ ని ప్రధాని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- సంకీర్ణ ప్రభుత్వాల మద్దతు కూడగట్టుకున్న మోడీ
- రాష్ట్ర అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారాన్ని అందించిన ప్రజలు అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు అండగా నిలవడంతో భారీ మెజార్టీతో విజయం సాధించిందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సురేఖ మాట్లాడుతూ 100రోజుల కాంగ్రెస్ ప్రజాపాలనలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు ఆదరించారన్నారు. ప్రతిపక్షాలు, మతతత్వ పార్టీ బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసి ప్రజలను ప్రలోభాలకు గురిచేశారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక నాయకుల సమన్వయంతో పనిచేసి ప్రత్యర్థి పార్టీల నాయకులను మట్టి కరిపించారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. ప్రజలు తమపైఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని ప్రాంతాల అభివద్ధికి తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికైన కడియం కావ్య మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తూ వరంగల్ నగరఅభివృద్ధికి సహచర సీనియర్ నాయకుల సహకారంతో ప్రణాళిక బద్ధంగా తీర్చిదిద్దుతానని అన్నారు. తన గెలుపుకు సహకరించిన జిల్లా ప్రజానీకానికి, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పిసిసి సభ్యులు నమిండ్ల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కట్ట రఘుపాల్‌రెడ్డి, బొల్లె పోగు రమేష్ బాబు, శనిగరం వెంకటేష్, మారుపాటి వంశి రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఫోరంకు సంపూర్ణ సహకారం : టీఎన్‌జీవో



నవతెలంగాణ-సుబేదారి

ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ ఫోరం బలంగా ఉందని వారికి టీఎన్‌జీవోస్ జిల్లా యూనియన్ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. హన్మకొండ టీఎన్‌జీఓస్ యూనియన్ కార్యాలయంలో ప్రోహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఫోరం రాష్ట్ర సర్వసభ్య ఫోరం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఫోరం అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆకుల రాజేందర్ హాజరై మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ ఫోరం బలంగా ఉందని వారికి జిల్లా యూనియన్ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కేంద్ర సంఘం నాయకత్వంలో త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరమవుతాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా వుందని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫోరం బాధ్యులను హనుమకొండ జిల్లా పక్షాన అభినందనలు తెలియజేశారు. ఫోరం అధ్యక్షులు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ 317 జీఓలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని కూడా ఉంటాయని పేర్కొంటూ తప్పనిసరిగా ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా టీఎన్జీవోస్‌కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం ఫోరం బాధ్యులను ఆకుల రాజేందర్, బైరీ సోమయ్య,జిల్లా బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫోరం కార్యదర్శి అనిల్, జిల్లా ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి రవి ,హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, ఫోరం నాయకులు విశ్వేశ్వర్,క్రాంతికుమార్,శశికాంత్, జాన్ మోసెస్,కుతుబుధిన్, శ్రీనివాస్,రవి, ప్రణీత్, దీపక్ రంజిత్, భరత్ నాయక్, అన్నపూర్ణ, గంగ భాయ్, టీఎన్‌జీఓస్ యూనియన్ అసోంయేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికేల రాజేష్,కేంద్ర సంఘం నాయకులు శ్యామ్ సుందర్, మొయిజ్,లక్ష్మీ ప్రసాద్ మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఖన్నా, అనూప్ రాజ్, ప్రణయ్ రాజ్, పథ్విరాజ్, రాజీవ్ రాజ్,శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు విద్యుత్ కోతలు ఉండవద్దు

- ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హన్మకొండలోని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ విద్యుత్ భవన్ కార్పోరేట్ కార్యాలయం లో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం అన్ని సర్కిళ్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీఎండీ మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే గ్రూప్ -1 పరీక్షలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించేటట్లు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్ఈ లను ఆదేశించారు . ప్రతి సెంటర్ కు ఏ .ఈ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్ లను నియమించాలని ఎస్ఈ లను కోరారు. ఈ నెల జరిగే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ కూడా విద్యుత్ అంతరాయాలు జరగకుండా అన్ని సత్వర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజియం కె.కిషన్, డిఈ(టి) కె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం

నవతెలంగాణ-నయీంనగర్

జాతీయ లోక్ అదాలత్‌ను నేడు శనివారం ఉదయం 10 గంటలకు వరంగల్, హన్మకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, వరంగల్- చైర్మన్స్ బివి.నిర్మలా గీతాంబ, సిహెచ్.రమేష్ బాబులు ప్రారంభించనున్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్, హనుమకొండ కార్యదర్శులు ఎం.సాయికుమార్, జె.ఉపేందర్ రావు, వరంగల్, హనుమకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు హాజరుకానున్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ధర్మసాగర్

హనుమకొండ జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని అనుమకొండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శికర్రే బిక్షపతి అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ అంబేద్కర్ సెంటర్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ ఈనెల 15 .16 తేదీల్లో ధర్మసాగర్ మండల కేంద్రంలో ఉన్న సుస్మితఫంక్షన్ హాల్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ అనుమకొండ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని,పార్టీ సానుభూతిపరులు సహకరించాలన్నారు. రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారతదేశానికి స్వాతంత్రం కావాలని నినదించింది ఉద్యమించింది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. మీరట్,కాన్పూర్ లాహెూర్, పెషవర్ కుట్ర కేసులో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల పైన నాయకుల పైన కేసులు పెట్టి జైల్లో నిర్బంధించి, చిత్రహింసలు పెట్టినా కూడా భారతదేశానికి స్వతంత్రం తప్ప మరో గత్యంతరం లేదని అనేకమంది త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందని గుర్తు చేశారు.స్వాతంత్రం వచ్చేదాకా విశ్రమించని పోరాటం నడిపినది కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా బానిసత్వం,వెట్టిచాకిరికి పటేల్ పట్వారి తత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి 4500 మంది కమ్యూనిస్టు వీర కిశోరాలు తమ రక్తాన్ని చిందించి 3000 గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలు తెలంగాణలో పేదలకు పంచిన ప్రపంచచరిత్ర లో లిఖించదగినదని ఘట్టమన్నారు.ఈ శిక్షణ తరగతులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంక రెడ్డి,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. పార్టీ సానుభూతిపరులందరూ సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్,జిల్లా సమితి సభ్యులు కొట్టేపాక రవి,మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, తోకల రాజయ్య చిలుక బాబు,మద్రిపల్లి అంకుష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధ్యాయుల బడిబాట







నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండల పరిధిలోని భావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడి, తమరి పిల్లలను అందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు, మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బృందం, ప్రైవేట్ కు ధీటుగా విద్యాబోధన చేస్తారన్నారు. ఉచిత, విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు,రెండు జతల యూనిఫామ్స్, పౌష్టికహారం, వారనికి మూడు గ్రుడ్ల తో పాటుగా నాణ్యమైన విద్య అందిస్తారని అన్నారు.

ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు కృష్ణప్రియా, సునీత, రామాదేవి, రషీదా, శ్రీనివాస్, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

నడికుడ : మండలంలోని చర్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో రెండవ రోజు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు హాండ్ మైకు పట్టుకుని గ్రామంలో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల యొక్క ప్రత్యేకతలను తెలియజేస్తూ ఇల్లు ఇల్లు తిరుగుతూ విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్య లభిస్తుందని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో మీ బిడ్డపై పెట్టే ఖర్చు ప్రస్తుతం పొదుపు చేసినట్లయితే వారి ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని అన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వం అన్నిఏర్పాట్లు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య శీలం సరిత, తాళ్లపల్లి మంజుల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుబేదారి : ఐసిడిఎస్ హనుమకొండ ప్రాజెక్ట్ అంగన్వాడీ కేంద్రం లో శుక్రవారం సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మధురిమ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణిలకు సీమంతం, 6 నెలల పిల్లలకు అన్నప్రసాన ,అంగన్వాడీ కేంద్రం పిల్లల ఆనంద నిలయం అనే పోస్టర్లు విడుదల చేశారు. డిడబ్ల్యూఓ మధురిమ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు నూతన విద్యా ప్రణాళిక ప్రకారం పూర్వ ప్రాథమిక విద్య పాటు పిల్లల భద్రత, సంరక్షణ చూస్తూ నర్సరీ, ఎల్ కేజీ, యూకే జీ తెలుగు, ఇంగ్లీష్ నేర్పడం, పిల్లల సమగ్రాభివృద్ధి, నైపుణ్యత, పోషకాహారం అందిస్తూ పిల్లల బంగారు భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు తోడ్పడే విధంగా పనిచేయాలన్నారు. అన్నిపూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సరస్వతీ, అయా స్వప్న, వినోద, ధనలక్ష్మీ అశలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులకు అవకాశం కల్పించాలి : ఏఐటీయూసీ



నవతెలంగాణ-ములుగు

మెడికల్ కళాశాలలో ఉద్యోగాల నియామకాల్లో, ములుగు జిల్లా వైద్యశాలలో గత ఏడేళ్లుగా థర్డ్ పార్టీ కాంట్రాక్టులో పని చేస్తున్న శానిటేషన్ విభాగానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అధికారులను కోరారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి కూడా వారికి అన్యాయం చేసే విధంగా, అధికారుల దగ్గర ఊడిగం చేసే కొందరు పావులు కదుపుతున్నారు. అన్నారు. మెరిట్ పేరుతోని వారు అనుకున్న వారికి మెరిట్ లేకపోయినా ఉన్నట్లుగా చూపించే పరిస్థితులు కూడా జరుగుతున్నాయన్నారు. అం దుకే అతి తక్కువ వేతనంతో ఇన్నేళ్లు పనిచేస్తూ కనీసం ఔట్‌సోర్సింగ్‌కోసం ప్రయత్నిస్తున్నందున శానిటేషన్ విభాగా నికి సంబంధించిన వారందరికీ తప్పనిసరిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు విధానం అవలంభిస్తే ఆందోళనలు చేయవలసి వస్తుంది, అలాగే కో ర్టుకు కూడా వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారులు ఏమాత్రం అవకతవకలు జర గకుండా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
శనివారం | జూన్ 8, 2024 | www.navatelangana.com

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిసిన జనగామ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-జనగామ

భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని జనగామ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎంపీని శుక్రవారం హైదరాబాదు ఎంపీ క్యాంపు కార్యాలయంలో జనగామ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజమౌళి, మోర్తాల ప్రభాకర్, వెంకటేశ్వర్లు, కలిసి శాలువాతో సన్మానించారు. భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచినందుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.తన గెలుపుకు సహకరించిన జనగామ నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో అన్ని రకాల విత్తనాలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో అన్ని రకాల పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వానాకాలం సీజన్‌కు గాను మొత్తం 3,25,000 పత్తి ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా వేయగా, ఇప్పటికే వివిధ రకాల ప్యాకెట్లు 3 లక్షల వరకు అందుబాటులోకి రాగా, దాదాపు 1,25,000 ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం 1,75,000 ప్యాకెట్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా వరి, కందులు, మొక్కజొన్నలు ఇతర అన్ని రకాల పంటల విత్తనాలు రైతులకు సరిపోను అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎరువులు కూడా యూరియా 20,700 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,350 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 5,400 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



చినుకు పడడంతో మురిసిన రైతన్న...

- పత్తి విత్తనాలు విత్తడంలో బిజీబిజీ - చిగురించిన ఆశలు

నవతెలంగాణ-పాలకుర్తి

తొలకరి సందర్భంగా చినుకు పడడంతో రైతన్న మురిసిపోయాడు. పత్తి విత్తనాలు విత్తడం కోసం రైతన్న వేసవి దుక్కులను చదును చేసుకొని తొలకరి కోసం ఎదురు చూస్తున్నాడు. తొలకరికి ముందే పొషి దుక్కులలో కొంతమంది రైతులు విత్తనాలు విత్తగా, మరి కొంతమంది రైతులు తొలకరి కోసం ఎదురు చూస్తున్నారు. రోహిణి కార్తెలో విత్తనాలు విత్తితే ఎలాంటి చీడాపీడ ఆశించదని నమ్మకంతో రైతులు రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు విత్తుకోగా, మరికొంత మంది రైతులు తొలకరి జల్లుతో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు ఎదురు చూస్తున్న తరుణంలో గురువారం కురిసిన వర్షానికి రైతన్న ముఖంలో ఆశ చిగురించింది. చినుకు పడడంతో శుక్రవారం రైతులు పత్తి విత్తనాలు విత్తనడంలో బిజీ బిజీగా మారారు. పొషి దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతుల ముఖాల్లో ఆశలు చిగురించాయి. పాలకుర్తి మండలంలో రైతులు సుమారుగా 12 వేల ఎకరాలలో పత్తి పంటను సాగు చేసుకునేందుకు సమాయత్తమయ్యారు. పత్తి విత్తనాలు విత్తెందుకు కూలీల కొరత అధికంగా ఉండడంతో రైతులు వేసవి దుక్కులను చదును చేసుకొని పొషిలోనే పత్తి విత్తనాలను విత్తించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నప్పటికీ అందుకు భిన్నంగా రైతులు వ్యవసాయ సాగుపై దృష్టి పెట్టారు. పొషి దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులకు గురువారం రాత్రి కురిసిన వర్షం ఊరటను కల్పించింది. పొషి దుక్కుల్లో విత్తనాలు విత్తడంతో వేలరూపాయలు నష్టపోతామనే భయాందోళనలో ఉన్న మాకు వర్షం ఊరటనిచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వవిద్యాలయాలు నాణ్యతకు చిరునామాలు : ఎంపీపీ కళింగరాజు

నవతెలంగాణ-జనగామ

ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యాకేంద్రాలకు నిలయంగా ఉన్నాయని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శామీర్‌పేటలో నిర్వహించిన బడిఈడు పిల్లల సర్వే కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మౌళికవసతులను చేపట్టడం ద్వారా మరింత ఆకర్షణీయంగా పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని, ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్, పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఉచిత విద్య అందుబాటులో ఉండగా డబ్బులను వృథా చేసుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సామాజిక అవగాహన ఉంటుందని, పై పై మెరుగులు చూసి మోసపోకుండా నాణ్యతకు చిరునామాగా ఉన్న సామాజిక కేంద్రాలైన ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిన బాధ్యత ప్రతిఒక్కరి పైన ఉందన్నారు.అందుకోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధీర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్ పర్సన్ కొలిపాక మమత, ఉపాధ్యాయులు ఫాతిమా మేరీ, నహిదా భాను, అంగన్వాడీ ఉపాధ్యాయులు జ్యోతి, ప్రేమలత, స్వరూప రాణి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు

- కౌన్సిలర్ గాదెపాక రామచంద్రం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలో నైతిక విలువలు, సమగ్ర మూర్తిమత్వం అలవాడతాయని, విద్యార్థులు తల్లిదండ్రులను ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని 16వ వార్డ్ కౌన్సిలర్ గాదేపాక రామచంద్రం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక హరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల రాములు అధ్యక్షతన శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి రాజేందర్, ఇతర ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సిహెచ్ అరుణ, మహిళా సంఘాల ఆర్‌పి ప్రశాంతి, మహిళా సంఘాల అధ్యక్షులు తాటి రజిత, గోవింద, ప్రేమలత, పానుగంటి సువార్త, బుట్ల సుమలత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులలో ఉన్న అన్ని రకాల సృజనాత్మక గుణాలను వెలికి తీస్తారని, అందుకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

11న జాబ్ మేళా : జిల్లా ఉపాధి అధికారి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఎస్-బ్యాంక్ హైదరాబాద్ శాఖలో సీనియర్ అధికారులుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సిహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హత కలిగి 27 నుండి 30 సంవత్సరాలలోపు వయసు ఉన్న యువతీ యువకులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతోపాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో సిద్దిపేట రోడ్డులోని ఏకశిలా ఐటిఐ కళాశాలలో జరిగే జాబు మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.25 వేల వేతనం, ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయని, హైదరాబాదులో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995430401 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వాస్విక్ ఫౌండేషన్ ఉధారత

నవతెలంగాణ-బచ్చన్నపేట

తల్లిదండ్రులు లేని అనాథ పేద విద్యార్థిని విద్యార్థులకు వాస్విక్ ఫౌండేషన్ 1వ తరగతి నుండి డిగ్రీ చదువుల వరకు ఉచిత వసతితో పాటు ఉత్తమ విద్యను అందిస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన నిరుపేద అనాథ విద్యార్థులకు హైదరాబాద్‌లో గల విక్టోరియా మెమోరియల్ హోమ్, ఏవీజీ లాంటి వాటిల్లో సిఫార్సు చేసి ఉజ్వల భవిష్యత్తుకి తోడ్పాటు అందిస్తున్నారు. పూర్తి వివరాలకు 7095701173, 9550236376 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్ష నిర్వహణ : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

గ్రూప్-1 పరీక్ష నిర్వహణను పక్కాగా నిర్వహించాలని, నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్ రామరాజు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ మాట్లాడుతూ టీజీ పీఎస్సీ ద్వారా జిల్లాలో రేపు జరుగబోయే గ్రూప్-1 పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహణను చేపట్టాలన్నారు. ఒక గదిలో 24 మంది పరీక్ష వ్రాసేందుకు నిబంధన ఉన్నందున కేంద్రాలలో ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఆడ, మగ అభ్యర్థులకు విడివిడిగా తనిఖీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం ఒక రోజులో 3 నుండి 5 పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయవచ్చునని, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు ఐడి కార్డులతో విద్యార్థుల హాల్ టిక్కెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరిండెంట్‌కు తప్ప మరెవ్వరికీ మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. 14 పరీక్షా కేంద్రాల్లో 3697 అభ్యర్థులు హాజరవుతున్నారని, ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. హాల్ టికెట్ డౌన్ లోడ్‌లో అనుమానాలను నివృత్తి పరిచేందుకు హెల్ప్‌లైన్ నెంబర్ 9866011608లో సంప్రదించాలన్నారు. హాల్ టికెట్‌ను http://www.tgpsc.gov.in వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్‌ను ఏ-4 పేపర్ నందు ప్రింట్ తీసుకోవాలని తెలిపారు. హాల్ టికెట్‌లోని నిర్దేశిత స్థలంలో అభ్యర్థి లేటెస్ట్ ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించాలని, అభ్యర్థులు పరీక్షహాలుకు హాల్ టికెట్‌తో పాటుగా ప్రభుత్వ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటరు ఐడి కార్డు, ఇతర ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తోపాటు బ్లూ / బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలని, ఒకవేళ హాల్ టికెట్‌లో ఫోటో సరిగా ముద్రణ కాకపోయినా, లేదా కనిపించనట్లయితే అభ్యర్థి గెజిటెడ్ అధికారి/అభ్యర్థి చివరగా చదివిన సంస్థ ప్రిన్సిపాల్ చేత ధృవీకరించబడిన మూడు (3) పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను, అండర్‌టేకింగ్ ఫామ్ టీజీ.పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉన్న ఫార్మాట్‌తో పాటుగా తీసుకురావాలన్నారు. ఫోటోలు, అండర్‌టేకింగ్ ఫామ్‌ను పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు సమర్పించినట్లయితే అభ్యర్థి పరీక్షకు అనుమతించబడతారని, లేనట్లయితే అభ్యర్థి పరీక్ష హాల్‌లోకి అనుమతించబడరని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయం నుండి పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష హాలు నుండి బయటకు వెళ్ళేందుకు అనుమతించబడరని, పరీక్ష హాలును వదలి వెళ్ళే ముందు, అభ్యర్థి ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందజేయాలన్నారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా అభ్యర్థి తన బయోమెట్రిక్‌ను క్యాప్చర్ చేసే వరకు పరీక్ష హాలు నుండి బయటకు అనుమతించబడరని, అభ్యర్థి ఎవరైనా తన బయోమెట్రిక్‌ను ఇవ్వకపోతే వారి ఓఎంఆర్ ఆన్సర్ షీట్ మూల్యాంకనం చేయబడదని తెలిపారు. చేతులకు మెహంది, టాటూలతో పరీక్షకు వెళ్లకూడదని, ఒకవేళ ఉంటే బయోమెట్రిక్ చేయుటకు తంబ్ ఇంప్రెషన్ పడకపోవచ్చునని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూస్, సాక్స్ ధరించరాదని, కేవలం చెప్పులు మాత్రమే ధరించాలన్నారు. పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశించడానికి ఉదయం 9 గంటల నుండి 10.00 గంటల వరకు అనుమతి ఉంటుందని, ఉదయం10.00 గంటల తర్వాత పరీక్ష హాలు లోనికి అనుమతించబడరని తెలిపారు.

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థికి చేతులు లేకపోతే సహాయకుల కొరకు ఇంటర్ విద్యను పూర్తి చేసిన వారిని మాత్రమే స్క్రైబ్‌గా అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం వంటివి ఏర్పాట్లు చేయించాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర వస్తువులు అనుమతించబడవన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డిఆర్డిఏ పిడి మొగులప్ప జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- అందుబాటులో పాఠ్య, నోటు పుస్తకాలు
- పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో రాము



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జనగామ జిల్లా విద్యాధికారి రాము అన్నారు. శుక్రవారం జనగామ జిల్లాప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి రాము పరిశీలించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాలకు, పాఠశాలలకు పంపిణీ అయినా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు వివరాలను ఎస్టి బుక్స్ మేనేజర్ సంపత్ ను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పాఠశాలలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వీవర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నిర్వహించిన పనులను డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 2,29,630 పాఠ్యపుస్తకాలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 2,03,300 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, ఇంకా 26,330 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పాఠ్యపుస్తకాలలో ఇప్పటివరకు మండల కేంద్రాల వరకు 1,27,581 పాఠ్యపుస్తకాలు, అలాగే పాఠశాలల వరకు 75,268 పాఠ్య పుస్తకాలు చేరవేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ సరిపడ నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన 2,02,653 నోటు పుస్తకాలు జిల్లా కేంద్రానికి వచ్చాయని వాటిని మండల కేంద్రం, పాఠశాలలకు 2,02,653 నోటుపుస్తకాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు అవసరమైన తరగతులకు వర్కు నోటుబుక్కులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. తమ పిల్లలకు బాధ్యతతో విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఈబి సెక్రెటరీ చంద్రభాను, ఏసిజిఈ రవికుమార్, నోడల్ అధికారి నర్సయ్య పాల్గొన్నారు.



వరదనీటిలో ప్రయాణించేదెలా..?

- వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం
- శాశ్వత పరిష్కారం చూపాలి : గ్రామస్థులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ఇటీవల కురుస్తున్న వానతో రోడ్డుపై వరదనీరంతా నిలిచిపోయింది. ఈ రహదారిపై తమతమ విధులకు వెళ్ళాల్సిన వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో తూతూ మంత్రంగా సీసీరోడ్డు పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్య కారణంతోనే చిన్నపాటి వర్షానికి రోడ్డుపైన వర్షపునీరంతా రోడ్డుపైనే నిలిచి, పాదచారులకు, వాహనదారుల ప్రయాణం ఇబ్బందిగా మారడంతో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గ్రామపంచాయితీ కార్యాలయానికి వెళ్ళే దారిలో 2, 3వార్డుల్లో వర్షపునీరంతా నిత్యం నడిచే దారిలో నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిలవకుండా చర్యలుతీసుకోవాలని శుక్రవారం ఆందోళన చేపట్టారు. వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారిందని, అటుగా వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని ప్రజలు వాపోతున్నారు.

వరద నీటిని వెంటనే తొలగించాలి : పల్లె రవీందర్, స్థానికుడు



గతంలో సీసీ రోడ్డు వేసేటప్పుడు చెప్పాం. రోడ్డును మట్టితో ఎత్తుగా చేసి, సీసీ పోయాలని చెప్పినా అధికారులు కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. తద్వారా ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే వరద నీటిని వెంటనే తొలగించాలి.

అసలే వానాకాలం... : పిట్టల మధు, కాలనీవాసి



చిన్నపాటి వర్షానికి ఇలా అయితే, మున్ముందు పెద్ద వర్షాలు కురిస్తే వరద నీటితో రోడ్డంతా ఇబ్బందికరంగా మారుతుంది. త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది : వలబోజు సోమన్న, స్థానికుడు



అసలే వానాకాలం.. ఈపాటి వర్షానికే ఇలా నీరు రోడ్డుపై చేరితే ఎలా.. మమ్మల్ని పట్టించుకునే వారే లేరు. రోడ్డుపై వర్షపు నీటితో ప్రయాణం ప్రమాదకరం. అంతకంటే ఎక్కువగా మురుగునీరు రోడ్డుపై చేరటంతో దోమలు, ఈగలువాలి, రోగాల బారినపడే ప్రమాదముంది. దయతో అధికారులు తమ సమస్యను పరిష్కరించాలి.

మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలి

- టీపీపీఎఫ్ డిమాండ్ - అదనపు కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని, ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, టీచర్ల బదిలీల, ప్రమోషన్ల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిపిటిఎఫ్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌కు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ కారణాలతో జిల్లాలో 58 పాఠశాలలు మూసివేశారని, విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల బాలబాలికలకు పాఠశాలవిద్య అందుబాటులో ఉండాలని, అందుకోసం మూతపడిన అన్ని పాఠశాలలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక గది లేకపోవడం, ఒకరిద్దరూ టీచర్లే ఐదు తరగతులు బోధించే దుస్థితి ఏర్పడిందన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, ఉద్యోగ విరమణ వల్ల ఖాళీ అయిన సాధారణ ఖాళీలను వెంటనే భర్తీ చేయకపోవడం, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను అప్పజెప్పడం తదితర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల మూలంగానే సమాజం ప్రభుత్వ బడులకు దూరంగా ఉంటుందని వాపోయారు. గత ప్రభుత్వ విద్యా విధానాలు లోపభూయిష్టంగా ఉండడం వల్లే బడి ఈడు పిల్లలు గ్రామాల్లో ఉన్నప్పటికీ పాఠశాలలు మూసివేతకు గురవుతున్నాయని వాపోయారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని, దానికి తగిన సమాజ ఆమోద కార్యాచరణ రూపొందించాలని, విద్యా విధానాల్లో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులకు ప్రభుత్వం హామీ పడాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మయ్య, ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలని, ప్రతి పాఠశాలకు ఒక సర్వీస్ పర్సన్ నియమించి పాఠశాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా నాయకులు వజ్రయ్య శ్రీహరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాటాలకు రైతులు సిద్ధం కావాలి : సీపీఎం



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

భూపోరాటాలకై రైతులు సిద్ధం కావాలని సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు అపరాధపు రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఈనెల 10న జరగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం కొత్త మండలాలు ఏర్పాటు చేసినా రైతుల సమస్యలు పాలకులకు పట్టడం లేదని అన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించకుండా రైతులను అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాట పటిమ కల్గిన ఏకైక పార్టీ సీపీఎం అన్నారు. రైతులను ఐక్యం చేసి రైతు సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్నారు. ఇందుకు మద్దతుగా సీపీఐ మండల సహాయ కార్యదర్శి బోనగిరి కుమారస్వామి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల కార్యదర్శి ఆవుల ప్రభాకర్, గుంటి భీమన్న, బోనగిరి కనకయ్య, మంద రాజు, సుంక సాయం, సమ్మయ్య, శివశంకర్, కట్టె ఎల్లయ్య, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకు 'వైస్‌ఎంపీపీ చల్లా' శుభాకాంక్షలు



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు నియోజక వర్గ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటికొండ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడమ కట్టమల్లు, మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, గౌడ సంఘం అధ్యక్షులు బొంగోని యాదగిరి, తాటికొండ సంపత్, గూడెల్లి యాదగిరి, ప్రతాప గిరి మల్లేశం, చొక్కం శ్రీను, రాములు, పొన్నం రఘు, బలిజ రాజు, బొంకూరు యాదగిరి బర్మ రాజు, మారపాక నందు, లాల్ రమేష్, మారపాక బాబు, పాలకుర్తి నాగరాజు, బొల్లం నాగరాజు, మేకల అనిల్, తాడూరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీని కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-బచ్చన్నపేట

కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ ఎంపిగా గెలిచిన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ బచ్చన్నపేట మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమటికేశవపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్ నల్లగోని వేణు, మచ్చ సందీప్, కంతెం, కర్ణాకర్,అఖిల్ మాల,అభి తదితరులు పాల్గొన్నారు.



కడియం కావ్యకు అభినందనల వెల్లువ

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య భారీ మెజారిటీతో గెలుపొందగా శుక్రవారం చిల్పూర్ మండలం రాజవరం ఎంపీటీసీ మారేపల్లి లలిత, శ్యాం కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జీ తీగల మహేందర్, జక్కుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-లింగాలఘనపురం

హన్మకొండ జిల్లా కేంద్రంలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వగృహంలో ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యను శుక్రవారం లింగాలఘనపూర్ మండల నేతలతో కలిసి జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌గా మణుదీప్ ఆదిత్య



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మారపాక భాస్కర్ కుమారుడు మారపాక మణుదీప్ ఆదిత్య హన్మకొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ 12 సంవత్సరాల జవాలిన్ త్రోలో రాష్ట్ర స్థాయి పోటీలలో తృతీయ స్థానం సాధించాడు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించిన మణుదీప్ ఆదిత్యను శుక్రవారం గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు అభినందించి జాతీయ స్థాయిలో రాణించాలని అభిప్రాయం వ్యక్తపరిచారు.

మహిళలు, విద్యార్థినిల రక్షణ కోసమే షీ టీంలు



నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లాలో ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థుల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఎస్ఐ సునంద, ఏఎస్ఐ ఆనందం అన్నారు.మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఆదేశాను సారంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో షీటీం పర్యవేక్షణలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం ఏఎస్ఐ ఆనందం మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేయాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ టీమ్ వాట్స్ అప్ నంబర్స్ 8712656935, 7901142009కి తెలియచేసినచో తగిన చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి మృగశిర కార్తె - ఆస్తమా రోగులకు చేపమందు

నవతెలంగాణ-మహబూబాబాద్



తెలుగు రాష్ట్రాల్లో స్వాతంత్రానికి పూర్వం నుండి మృగశిర కార్తె ప్రారంభం రోజున ఆస్తమా రోగులకు చేప మందు వేయడం ఆనవాయితీగా వస్తుంది. నేడు శనివారం నుండి మృగశిర కార్తె ప్రారంభం కానుంది. అందులో భాగంగానే తెలుగు రాష్ట్రాల్లో మృగశిర కార్తె రోజున చేపలు తినాలి అనేది నానుడిగా వస్తుంది. తెలుగు పంచాంగం ప్రకారం 27 నక్షత్రాలు ఉన్నాయి . ఉగాది నుంచి ఉగాది వరకు అశ్విని మొదలు రేవతి వరకు 27 కార్తెలు వస్తాయి. మృగశిర ఐదవ కార్తెగా ఉంది. ఒక్కొక్క కార్తె 14 నుంచి 18 రోజులు ఉంటుంది. ఉగాదినాడు అశ్విని నక్షత్రం ప్రారంభమై మళ్లీ ఉగాది నాటికి రేవతి నక్షత్రం పూర్తి అవుతుంది. మృగశిర కార్తె ప్రారంభం రోజు హైదరాబాదులోని ఎల్బీస్టేడియంలో ఆస్తమా రోగులకు చేప మందు వేయడం సాంప్రదాయంగా వస్తుంది. ఇందుకు ప్రభుత్వం కూడా అన్ని ఏర్పాట్లు పోలీస్ బందోబస్తు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో ముందస్తుగా ఒకరోజు ముందుగానే మత్స్యకారులు వేలాది కింటాలా చేపలను మార్కెట్‌కు తరలించారు. సాంప్రదాయం ప్రకారం మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తుంది.

ప్రైవేటు పాఠశాలల్లో నోటు పుస్తకాల విక్రయాలు ఆపాలి : ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-తొర్రూరు



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫార్మ్, ఇతర స్టేషనరీ సామాన్లు ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయాలు నిలిపివేయాలని కోరుతూ స్టేషనరీ బుక్స్ వ్యాపారులు శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గంజి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయాలు చేపట్టడం వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషనరీ వ్యాపారులు శోభన్, ఉప్పలయ్య, వెంకట్, సూరిబాబు, వసంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించండి

- బలరాం తండా మాజీ సర్పంచ్ హరినాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, భవిష్యత్తు అక్షరాస్యత నిర్మూలన కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బలరాం తండా మాజీ సర్పంచ్ హరినాయక్ అన్నారు. శుక్రవారం ఆమనగల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు గ్రామంలోని మంగలి తండా, బలరాం తండాలలో ఇంటింటికి తిరిగి పాఠశాలలో పది మంది విద్యార్థులను చేర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కళ్లెం వెంకట్ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు వీణ, రజిత, గ్రామస్తులు, ఉపాధ్యాయులు దేశభయిన వెంకన్న, వీ.శశిధర్, బలాస్టి రమేష్, భూక్య బాలాజీ, కారిపోతుల యుగంధర్,ఎం.శ్రీనివాస్, ఏ.రామాచారి, ఎండి. ఉస్మాన్, ఎస్.హైమ, ఎస్కే షమీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలలో చెత్తను తొలగించండి

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

రాబోయే వర్షాకాలంలో డ్రైనేజీలు బ్లాక్ అయి రోడ్లపై మురికినీరు నిల్వ ఉండకుండా ఉండాలంటే డ్రైనేజీలలో చెత్తా, చెదారం, చెట్లు తొలగించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని గ్రంథాలయం, శ్రీనివాస థియేటర్ ప్రక్క నుండి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ప్రధాన డ్రైనేజీ సమస్యను పరిశీలించి డ్రైనేజీకి అడ్డుగా ఉన్న వాటిని తొలగించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో ఉన్న ప్రధాన డ్రైనేజీలలో చెత్త, పిచ్చి చెట్లను తొలగించాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలు మురికి కాలువలో చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, చిదిరాల శరత్, టీపీఎస్ ప్రవీణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య

నవతెలంగాణ-తొర్రూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డేలో భాగంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టడానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కుళ్లిపోయిన కూరగాయలను కంపోస్ట్ షెడ్డు కు తరలించాలని సిబ్బందికి సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి శానిటేషన్ నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వినియోగించినట్లయితే జరిమానా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలి : కొత్తపల్లి రవి

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు మండలం వ్యవసాయ శాఖలో జరిగిన విత్తన కుంభకోణం పై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంద)జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం పార్టీ ప్రతినిధి బృందంతో కలిసి తొర్రూర్ డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిప్యూటీ ఎమ్మార్వో ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1600 బస్తాలను రైతుల పేరుతో భోగస్ అగ్రోస్ ద్వారా అమ్ముకున్న అధికారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముందంపల్లి వీరన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బండపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పల్లెల పాపారావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు అనిల్, గజ్జి యాకయ్య సాయిలు, మధు, వెంకన్న, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో గ్రామాలు ఆర్థికాభివృద్ధి

- సాయి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అడప శిరీష

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



మండలంలోని కంటేయపాలెం, పత్తేపురం, మడిపల్లి తదితర గ్రామాలలో నాబార్డు సహకారంతో సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నాబార్డ్ సహకారంతో తొర్రూరు గొర్రెల పెంపకం పై ఏడు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల యొక్క సంరక్షణ, వాటి అభివృద్ధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా గొర్రెలకులోను సౌకర్యం కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును నాబార్డ్ అందిస్తుందని సాయి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అడప శిరీష తెలిపారు. సుమారుగా 120 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మంగళపల్లి సైదులు, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి కవిత పరామర్శ

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని ఓపత్రిక విలేకరి యాకుబ్ రెడ్డి తండ్రి కోండ్రెడ్డి రామ్ రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనాథ్ రెడ్డి, కముటాం శ్రీనివాస్, లింగాల పిచ్చయ్య మోడెం రవీందర్ గౌడ్, కోట్రెడ్డి రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

- వ్యకాసా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ రాజన్న, అల్వాల వీరయ్య, కుర్ర మహేష్

నవతెలంగాణ-మహబూబాబాద్



కేరళ తరహాలో మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ రాజన్న, అల్వాల వీరయ్య, కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ పట్టణ పేదలు ధర్నా చేపట్టారు. ఈధర్నాకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మండ రాజన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అల్వాల వీరయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో బీజేపీ ప్రభుత్వం ఎన్ఎంఎస్, ఏబీపీఎస్ యాప్ తీసుకొచ్చి పేదలనోట్లో మట్టి కొట్టిందన్నారు. కొలతలు లేకుండా పని కల్పించాలని చట్టం చెబుతుంటే కొలతలు పెట్టి కనీస వేతనం పడకుండా రోజుకు రూ.150 నుండి రూ.200 వేతనం కూడా ఇవ్వటం లేదన్నారు.చట్టంలో పలుగు, పారలు, ఫస్ట్‌ఎయిడ్ కిట్టు, మంచినీరు, సమ్మర్ అలవెన్స్ ఇవ్వకుండా, కేంద్రంలో 10 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వం ఉపాధి నిధులు తగ్గించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీల పోరాటంతో వచ్చిన చట్టాన్ని గత పది సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టానికి తూట్లు పొడిచారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పేదల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 6 గ్యారంటీలు తక్షణమే అమలుకు పూనుకోకపోతే కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్, కొడం చంద్రకళ, గుడిశాల వెంకన్న, వంగూరు వెంకటేశ్వర్లు, బాణాల రాజన్న, ఎండి యాకూబ్, ప్రశాంత్, సుజన, నగన్న, పెరుమాండ్ల సమ్మయ్య, ఉమ, లక్ష్మీ, అలివేలు, ప్రియాంక, రమణ, వేణు, కాంతమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహర్షి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

- విద్యార్థి సంఘాల ధర్నా

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ పట్టణంలో స్థానికంగా ఉన్న మహర్షి పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తాము నిర్ణయించిన రేటు ప్రకారం పుస్తకాలు, నోట్‌బుక్స్, టై,బెల్ట్, యునిపామ్స్ అమ్ముతున్నారని, వెంటనే ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రవణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దేవందర్, వీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈర్ల మనోజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహర్షి పాఠశాలలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇదేమిటి అమ్మడం నేరం అని ప్రశ్నిస్తే..? మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని, డీఈవో రామారావు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ స్కూళ్లపై ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో పునఃప్రారంభం కాకముందే పిల్లల తల్లిదండ్రులకు తక్షణమే పాఠ్య పుస్తకాలు తీసుకోవాలని మెసేజ్ రూపంలో పంపిస్తు పుస్తకాలు సకాలంలో తీసుకోని యెడల పిల్లల అడ్మిషన్ క్యాన్సిల్ అవుతుంది అంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నారన్నారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకూడదనే ఉత్తర్వులు ఉన్నప్పటికీ మహర్షి పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్స్ పై విద్యాధికారులు స్పెషల్ రైడ్స్ చేయాలని, ఆదేశాలను బేకతారు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థులను సమీకరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి,పుస్తకాల్ని సీజ్ చేస్తామని అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుగలోతు సూర్య ప్రకాష్, జ్యోతి బాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మేక వెంకటేష్, వికాస్, సాయి, కిరణ్, తరుణ్, అనిల్ పాల్గొన్నారు.

అక్రమ మొరం దందా... మైనర్‌లే డ్రైవర్లు..!

- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

నవతెలంగాణ- ఇనుగుర్తి



సరిగ్గా పద్దెనిమిది ఏళ్లు నిండని మైనర్ బాలుడు ట్రాక్టర్ డ్రైవర్ అవతారమెత్తాడు. స్టీరింగ్ పట్టి రోడ్డు పై ట్రాక్టర్ నడుపుతు హల్ చల్ చేస్తున్నాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు మీడియాకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన 'నవతెలంగాణ' మీడియా ప్రతినిధి వివరాలు ఆరా తీయగా సదరు మైనర్ బాలుడు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తు అక్రమంగా మొరం దందా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇదంతా ప్రభుత్వ అధికారుల కనుసన్నలలో జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా మొరం దందాకు తెరలేపారని గ్రామస్తులు ఆరోపించారు. మైనర్లు, లైసెన్స్ లేని వారితో తక్కువ నగదు ఇచ్చి కొందరు తమ పనులు చేయించుకుంటున్నారు. అలాగే మైనర్లు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ ఎదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరిని ప్రశ్నిస్తున్నారు. భయంకరంగా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇనుగుర్తి గ్రామానికి చెందిన గండు నాగన్న గౌడ్ డిమాండ్ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : నాగన్న గౌడ్



మైనర్లు వాహనం నడుపుతూ ఇతరులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోయారు. లైసెన్స్ లేని వారు, మైనర్లు వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన గండు నాగన్న గౌడ్ డిమాండ్ చేశారు. అనేకమంది మైనర్ బాలురులు విచ్చలవిడిగా టూ, ఫోర్ వీలర్ నడుపుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. వాహనాలు నడుపుతున్న మైనర్లపై పోలీసులు నిఘావేసి చర్యలు తీసుకోవాలి.

డీడీలు వాపసు వద్దు... నగదు బదిలీ చేయాలి...

- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్



డీడీలు వాపసు వద్దు... నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి (జెడి) డాక్టర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమం 2017లో గొర్రెల పంపిణీ ముందు రెండు సంవత్సరాలలో రాష్ట్రంలోని గొల్లకూరుమలకు అందరికి పూర్తిగా గొర్రెల పంపిణీ చేపట్టి కోటీశ్వర్లను చేస్తామని చెప్పి 7 సంవత్సరాలనుండి గొర్రెలు పంపిణీ పూర్తి చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందులో అనేక అక్రమాలు జరిగాయని, ఇప్పటికే రాష్ట్రంలో వేల మంది డీడీల డబ్బులు రూ. 43,750 కట్టి చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టినట్టుగా 100 రోజుల్లో రెండు లక్షల రూపాయలు పెట్టి గొర్రెలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినప్పటికీ కూడా గొర్రెల పంపిణీపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఆందోళన చేస్తున్నారని, వారు తీసిన డీడీల డబ్బులు తిరిగి ఇవ్వడం కాకుండా ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా డీడీలు తీసిన వారందరికీ గొర్రెలకు బదులుగా, నగదు బదిలీ చేసి గొల్లకురుమలను ఆదుకోవాలని కోరారు.గొర్రెలు పంపిణీలో అనేక అక్రమాలు పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమార్కులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్మడి గోవిందు, ఆమడగాని రఘు, జిల్లా నాయకులు గజ్జి మల్లేశం, దేవన బోయిన మల్లేష్, రాజు యాదవ్, ఎడ్ల శ్రీనివాస్, వడ్డేపూడి మల్లయ్య, బయా శ్రీను, రాంబాబు, రవి, వీరన్న, నరేందర్, రమేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు

నకిలీ వైద్యులపై రాష్ట్ర వైద్య మండలి తనిఖీలు

నవతెలంగాణ- మరిపెడ



జాతీయ వైద్య మండలి, రాష్ట్ర వైద్యమండలి ఆదేశాల మేరకు వైద్య టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డాక్టర్ వేములపల్లి నరేష్ కుమార్ అంటీ క్వాకరి బృందం డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, డాక్టర్ సెంకేశి శిరీష్ బృందం మరిపెడ (బంగ్లా)లోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం, నకిలీ వైద్య వ్యవస్థ వైద్య పరంగా ఎటువంటి విద్యార్హత లేకుండా పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకొని నిలువు దోపిడీ చేస్తు, వచ్చి రాని వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ వైద్యుడు కంపాటి రవి బాబు ఎటువంటి విద్యార్హత లేకుండా ఎంబీబీఎస్ వైద్యుని స్థాయిలో రవి క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స చేస్తూ మోసం చేస్తున్నట్లు గుర్తించారని పేర్కొన్నారు.

అలాగే నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసి బెడ్స్ వేసి ఇష్టారీతినా హై డోస్ ఆంటిబయోటిక్స్, స్టెరోయిడ్స్ ఇస్తున్నా రామారావుక్లినిక్ నకిలీ వైద్యుడు ఇస్లావత్ రామారావు, బివి నాయక్, శ్రీనివాస ప్రథమ చికిత్స కేంద్రం నకిలీ వైద్యుడు ఐ.వీరన్న నాయక్ నకిలీ వైద్యం అందిస్తున్నట్లు గుర్తించి వీరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నకిలీ వైద్యులు శంకర్, రాజు, వెంకన్నలు వారి కేంద్రాలు మూసి పారిపోయారు. ఈ ముగ్గురు పైన రాష్ట్ర కౌన్సిల్‌లో ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. మరోసారి జిల్లా అధికారుల సహకారంతో వీరి కేంద్రాలలో పై కూడా తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు.

సాధారణ కాన్పులు చేయాలి : డీఎంహెచ్‌వో

మహబూబాబాద్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను చేయాలని డీఎం హెచ్‌వో డాక్టర్ కళావతి భాయ్ సూచించారు. శుక్రవారం ఇనుగుర్తి మండల వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది, స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ప్ర జలకు ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రం పరిధిలో సాధారణ కాన్పులను చేయాలని వైద్యాధికారి, స్టాఫ్ నర్సుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధి కారి, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి కొప్పుప్రసాద్, ఎంపిహెచ్ఈఓ బిక్ష పతి, ఇన్చార్జి డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్త, ఆ శా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ...

తొర్రూరు : ప్రైవేటు ఆసుపత్రుల వారు ప్రభుత్వ నిబంధనలను పాటించి అన్ని అనుమతులు ఉంటేనే ఆసుపత్రి నిర్వహించాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య అధికారి కళావతి భాయి అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొర్రూరు పట్టణంలో నోద హాస్పిటల్, శ్రీ సూర్య డెంటల్ క్లినిక్, లోహిత్ డెంటల్ హాస్పిటల్, సుప్రీత హాస్పిటల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా అనుమతి లేని లోహిత్ డెంటల్ హాస్పిటల్, రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన నోదా హాస్పిటల్స్‌ను గుర్తించి అనుమతి లేకుండా నడుపుతున్నందుకు నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఇన్చార్జి డిపిహెచ్ఎన్ఓ, డిపిహెచ్ఎన్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్



గ్రూప్ వన్ పరీక్షలు ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశామని పరీక్షలు నిర్వహణ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం గ్రూప్-1 పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ గ్రూప్ వన్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, జిల్లాలో మొత్తం 12 సెంటర్లు ఉండగా మహబూబాబాద్‌లో 7, తొర్రూర్‌లో 5 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జూన్ 9 ఆదివారం నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు 4412 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని అన్నారు. ఏదేని సందేహాలను నివృత్తి చేయుటకు టీజీపీఎస్సీ టోల్ ఫ్రీ నెంబర్ 79 95074803 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

నవతెలంగాణ-మహబూబాబాద్



నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పిడి యాక్ట్ చేస్తామని డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. శుక్రవారం మహబూబాబాద్‌లో పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ ఆగ్రో ఏజెన్సీస్ బాలాజీ అగ్రి మాల్‌లోని విత్తన ప్యాకెట్లను పరిశీలించారు.తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడిఐ ఎం.లక్ష్మీనారాయణ, సిఐ దేవేందర్, ఏవో ఎస్.తిరుపతిరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ నివేదికలు ఇవ్వండి

- డీఏఓ కె.అభిమన్యు

నవతెలంగాణ-మహబూబాబాద్



వర్షాకాలంలో నకిలీ విత్తనాలు విక్రయాలు జరగకుండా ప్రతి వ్యవసాయ అధికారి, ఏఈఓలు దుకాణాలను మండలాల వారీగా తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి కే.అభిమాన్యు ఆదేశించారు. శుక్రవారం మానుకోట రైతు వేదికలో ఏవోఏ ఈవోల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం సీజన్లో రైతులకు అవసరమైన అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా నిల్వలు షాపులలో ఉంచాలని సూచించారు. రైతు భరోసా, రైతుబంధు, పిఎం కిసాన్ పథకాలు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏడిఏ రాజ నరేందర్, ఈవోజీ స్వామిజి, సారయ్య, మండలాల అగ్రికల్చర్ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలని వినతి

నవతెలంగాణ-గార్ల



మండలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సిపిఐ పార్టీ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కట్టె బోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సహకార పరపతి సంఘం అధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రైతు సంఘం మండలా ధ్యక్షుడు రాగం రమేష్, జనార్దన్, భీముడు, సత్యనారాయణ, పురిశోత్తం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మూగ జీవులు మృతి

- తీవ్ర శోక సంద్రంలో కుటుంబాలు

నవతెలంగాణ-చిన్న గూడూరు

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై 11 మూగజీవులు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూర్ మండలంలోని మంగోలిగూడెం, మేగ్యతండాల్లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాంగోలిగూడెం గ్రామనికి చెందిన రైతులు లునావత్ రామోజీ, లునావత్ రమేష్, లునావత్ బాలాజీ లునావత్ నరేష్, బానోత్ నరేష్, మచ్చ రాములకు చెందిన ఏడు ఎద్దులు, ఒక ఆవు అలాగే మేగ్య తండాలో బానోత్ సిరి, లకావత్ బాలు, లకావత్ సురేష్ లకు చెందిన మూడు ఎద్దులు పశు గ్రాసం కోసం వెళ్లిన క్రమంలో అప్పటికే తెగి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో అ మూగ జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. గురువారం రాత్రి వీచిన ఈదురుగాలుల వల్ల ఎల్‌టి లైన్ల వైర్లు తెగిపోయినట్టు సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న పశు వైద్యాధికారిని లక్ష్మి మృతి చెందిన మూగజీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన మూగ జీవాల విలువ మొత్తంగా 10 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు



కేసముద్రం రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ముందు గ్రామపంచాయతీ వర్కర్స్, అండ్ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధం, కేసముద్రం మండల గ్రామపంచాయతీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జాటోత్ మంగీలాల్, గంధసిరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గత తొమ్మిది నెలల నుండి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు లేక, పూట గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వ నుండి ఈ ప్రభుత్వం వరకు 9 నెలలుగా విధులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించని యెడల పూర్తిగా విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమాచార అధికారి, పి.సత్య ప్రకాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాల వెంకన్న వల్లందాస్ అనిల్, బిర్రు లక్ష్మణ్, బాల్య నాయక్, టేకుల శ్రీనివాస్, కొమ్ము భాస్కర్, సుంచు కొమురయ్య, కొంగర సౌందర్య, తెల్ల సుమలత, సుజాత, సంజీవ, దొంతరబోయిన సూరయ్య, జాన్సన్, ధరావత్ శీను, సుంచు శ్రావణ్, మరపాక సత్యమ్మ, గుతుప నాగన్న, దబ్బేటి సంతు, మైదం పవన్, లింగాడపు యాకయ్య, దుర్గం వెంకన్న, దైద తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన సమ్మయ్య గౌడ్

కేసముద్రం రూరల్ : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని పసునూరి ఉపేందర్-కావ్యల కుమార్తె నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారి లహరిని సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య , ఫౌండేషన్ సభ్యులు వీరేందర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, సురేష్, ప్రదీప్, మహేష్, శ్రావణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సీతక్క

- మంత్రి డాక్టర్ దనసరి సీతక్క

నవతెలంగాణ - ములుగు

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గతేడాది భారీ వర్షాలకు అనేక గ్రామాలు నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఉందని, ఈ ఏడాది ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. నీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు పరిశీలించి ఏమైనా మరమత్తులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే డీఎంఎఫ్ నిధులు మంజూరు చేస్తానని అధికారులకు సూచించారు. కరకట్ట నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని అన్నారు. గోదావరి జంపన్న వాగు ఉధృతి మూలంగా గతేడాది అనేక గ్రామాల్లో నీరు చేరి ముంపునకు గురైన పరిస్థితి ఉందన్నారు. ఈసారి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముంపునకు గల కారణాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మారేడుగుండ చెరువు కట్ట నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అన్నారు. రైతులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందరూ పని చేయాలని అధికారులకు సూచించారు.



పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ సందర్శన



నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల పరిధి అంబటిపల్లి పీహెచ్‌సీని శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి డీఎంహెచ్ఓ మధుసూదన్ సందర్శించారు. నేషనల్ క్వాలిటీ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంకెన ఆరోగ్య ఉప కేంద్రంను అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం బీసీజీ వ్యాక్సిం, సిబ్బందికి శిక్షణ పట్ల వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పూణెం రామారావు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రఘురాం, డీపీఓ చిరంజీవి, జిల్లా క్వాలిటీ మేనేజర్ డాక్టర్ భాను ప్రకాష్, హెచ్ఇఓ మురళీధర్ రెడ్డి, సూపర్వైజర్ నిర్మల మేరీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్స్ స్వప్న, మరియా, ఫార్మసిస్ట్ లక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

'డాక్టర్ రజిత'కు ఘన సన్మానం



నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ రజిత జాతీయస్థాయిలో నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమీలో ఎడిటర్‌గా ఎంపికయ్యారు. సంబంధిత పుస్తకంను టెక్ ప్రెస్, ఢిల్లీ వారు ప్రచురించారు. శుక్రవారం ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రజితను అభినందించి అధ్యాపకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రీసెర్చ్‌కి సంబంధించిన 8 పేపర్ పబ్లికేషన్స్, జర్నల్స్ రచించడంతో పాటు రాష్ట్రస్థాయిలో వివిధ సెమినార్లలో పాల్గొన్నట్టు చెప్పారు. డాక్టర్ రజిత భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, వి రమేష్, డాక్టర్ రాజు, శాఖమూరి రవీందర్, జీ రమేష్, రాజేందర్, పరుశురాం, మున్నయ్య,ఇమ్రాన్, మాధురి, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఏఎన్ఎస్



నవతెలంగాణ-వెంకటాపురం

పాలెం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో సాగు నీరు అందక రబీ పంట నష్టపోయి రైతులు అప్పుల పాలయ్యారని, అయినా ఇంజినీరింగ్ అధికారుల్లో చలనం లదని, వర్షా కాలం ప్రారంభం కావస్తున్నా పాలెం ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపకులు కొరసా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించి ఆయన మాట్లాడారు. ఆరుగుంట పల్లి వద్ద ప్రధాన రహదారి పై బ్రిడ్జి కట్టకపోవడంతో దిగువ రైతులకు నీళ్ల పూర్తి స్థాయిలో అందట్లేదని అన్నారు. ప్రాజెక్టు కాలువలన్నీ శిథిలావస్థకు చేరాయని అన్నారు. వెంటనే పాలెం ప్రాజెక్ట్ మరమ్మతులు చేపట్టి రైతులకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

ఏటూర్‌నాగారం క్రీడాకారులకు అభినందనలు



నవతెలంగాణ - ములుగు

తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ములుగు జిల్లా ఏటూర్‌నాగారం క్రీడాకారులు 8 మెడల్స్ గెలుపొందారు. వారిని జిల్లా క్రీడల అధికారి తుల రవి క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని , అన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గెలుపొంది జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లావణ్య కుమారి, కోచ్ పర్వతాల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పస్రా పోలిస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఏ కమలాకర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎట్టి సారయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్న కూతురు ఎట్టి ప్రియాంకకు పదేండ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 6న తండ్రి సారయ్య పని నిమిత్తం పస్రా గ్రామానికి వెళ్లాడు. ఆమె కూతురు ప్రియాంక తండ్రి కోసం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పస్రాకు చేరుకుంది. తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక అదృశ్యమైంది. చుట్టుపక్కల మొత్తం వెతికినా ఆమె ఆచూకి తెలియలేదు. ప్రియాంక అక్క ఎట్టి పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఆచూకీ ఎవరికైనా తెలిసిస్తే 8712670086నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వర్షాకాలం లోపు నీరందించేందుకు కృషి

- మేడిగడ్డ బ్యారేజీ సందర్శనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధి మేడిగడ్డ బ్యారేజీని శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌లో జరుగుతున్న పనులను బ్యారేజీ దిగువకు చేరుకొని మొదటగా 17, 20 నెంబర్ పిల్లర్ల వద్ద గేట్లను పరిశీలించారు. అక్కడినుండి నడుచుకుంటూ వెళ్లి 20వ నెంబర్ పిల్లర్ వద్ద పగుళ్ల ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత పనుల వివరాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లాలోని అన్నారం బ్యారేజీని సందర్శించి హెలికాప్టర్ ద్వారా మేడిగడ్డ లోని ఎల్ఎంటీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల వద్ద మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం లోపు మరమ్మతుల పనులు వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తమ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తమ్మిడిహెట్టి ప్రాజెక్టు తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, నీటిపారుదల శాఖ ఈఎంసి అనిల్ కుమార్, ఇతర ఇంజనీర్లు, ఎల్ అండ్‌టీ, అస్కాన్, నవయుగ సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.











'ముంపు గ్రామాలను తరలించాలి : ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ-మహదేవపూర్

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురవుతున్న గ్రామాలను వేరేచోటకు తరలించాలని కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరు ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం అన్నారం, మేడిగడ్డ, బ్యారేజీ సందర్శనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముంపునకు గురవుతున్న మల్లారం, దామరకుంట, గంగపురి, గుండ్రాత్‌పల్లి తదితర గ్రామాలను వేరే చోటకు తరలించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని కోరారు.





'భూ నిర్వాసితులకు మార్కెట్ రేట్ ఇవ్వాలి'

మేడిగడ్డ బ్యారేజ్ బ్యాక్ వాటర్ వల్ల నాలుగేండ్లుగా పంటలు పండట్లేదని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి భూములను మార్కెట్ రేట్ ప్రకారం ప్రభుత్వం తీసుకుని న్యాయం చేయాలని సూరారం గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. సూరారం గ్రామ శివారు రైతుల స్వంత పట్టా భూములు దాదాపు 200 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. మార్కెట్ రేట్ ప్రకారం భూములు ప్రభుత్వం తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలం అన్నారం బ్యారేజ్ సందర్శనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని పలువురు కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అన్నారం బ్యారేజ్ దిగువన ఉన్న అన్నారం ఎంపీటీసీ పరిధి గ్రామాల రైతుల భూములు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. బ్యారేజ్ దిగువన సుమారు 10కిలోమీటర్ల మేరకు కరకట్టలు నిర్మించి, అన్నారం, చంద్రుపల్లి, నాగపెల్లి, మద్దులపెల్లి, పల్గుల, కుంట్లం గ్రామాలను ఆర్అండ్ఆర్‌లో తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు, అన్నారం ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య, కాటారం మండల అధ్యక్షులు వేమూనూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వేమూనూరి రమ-శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెన్నెపురెడ్డి తిరుపతి రెడ్డి, యూత్ జిల్లా కార్యదర్శి పర్సవేణి నగేష్ యాదవ్, మండల నాయకులు కొండగొర్ల సంతోష్, మానేం మహేష్, వడ్లకొండ సమ్మయ్య పాల్గొన్నారు.

డీబీఎం -38 కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించాలి

- ఎమ్మెల్యే జీఎస్సార్

నవతెలంగాణ-భూపాలపల్లి

గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో ఎస్ఆర్ఎస్పీ డీబీఎం-38 కాలువ ద్వారా భూపాలపల్లి నియోజకవర్గంలోని కొత్తపల్లిగోరి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాల్లోని చివరి ఆయకట్టుకు నీరందించి, అన్ని చెరువులను నీటితో నింపాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. శుక్రవారం నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మేడిగడ్డ బ్యారేజీ వద్ద రెండు లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ కవర్ కాని గ్యాప్ ఆయకట్టు ద్వారా భూపాలపల్లి నియోజక వర్గంలోని గణపురం, భూపాలపల్లి మండలాల్లోని సుమారు 25వేల ఎకరాలకు నీటిని అందిస్తున్నట్టు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి త్వరలోనే ప్రాజెక్టులకు మంజూరు చేయించి ఇస్తామని హామీనిచ్చినట్టు ఎమ్మెల్యే జీఎస్సార్ తెలిపారు.





ప్రతి ఇంటికి తాగునీరు అందించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-ములుగు

జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని, మిషన్ భగీరథ సర్వే విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్ రావుతో కలిసి మిషన్ భగీరథ సర్వే మొబైల్ అప్లికేషన్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ... మిషన్ భగీరథ సర్వేయర్‌కు కేటాయించిన గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నల్లా కనెక్షన్ లేని గృహాలకు త్వరలోనే నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ సుభాష్, డీఈ హజార్, ములుగు ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓలు, ఏఈలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు టీఎన్జీవోఎస్ సన్మానం

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ములుగు జిల్లా పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించినందుకు ములుగు జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ ములుగు జిల్లా, జేఏసీ చైర్మన్ పోలు రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని సన్మానించారు. ముందుగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలు రాజు మాట్లాడుతూ కలెక్టర్ ప్రజలందరినీ చైతన్య పరుస్తూ ఉద్యోగులను సమన్వయం చేస్తూ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, కోశాధికారి భూక్యా లాల్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ రమాదేవి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఎనగందుల సునీత, ములుగు యూనిట్ అధ్యక్షులు టి. ప్రదీప్, రాంగోపాల్, పిట్టల రవి, రాజు పాల్గొన్నారు.



బడీ ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

- మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు

నవతెలంగాణ -తాడ్వాయి

మండల కేంద్రంలో శుక్రవారం జయశంకర్ బడి బాట కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని నోడల్ ఆఫీసర్ రేగా కేశవరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి ఇంటింటా సర్వే నిర్వహించారు. విద్యార్థుల వివరాలను వీఈఆర్‌లో నమోదు చేశారు. ఐదేళ్ల నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల నిండిన పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. 12న పాఠశాలలు పునర్ ప్రారంభమవుతాయని అన్నారు. పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్‌లు ఉచితంగా అందచేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులతో పాటు, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారని అన్నారు. ప్రధానోపాధ్యాయులు గెజిటెడ్ హెడ్మాస్టర్ కేశవరావు, శాలిని, రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బడిలో చేర్పించాలి : మల్కా భాస్కర్‌రావు

మల్హర్‌రావు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తాడిచెర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాధానోపాధ్యాయుడు మల్కా భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన తాడిచెర్లతోపాటు పలు గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ వంటి సౌకర్యాలు గురించి తల్లిదండ్రులు వివరించారు. 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జీపీఏ సాధిస్తున్నట్టు తెలిపారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.







ప్రభుత్వ బడులకు పంపించాలి : జీపీ నాయుడు

రేగొండ : ప్రభుత్వ పాఠశాలకు తల్లిదండ్రులు వారి పిల్లలను పంపించాలని రేగొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీపి నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పిల్లల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. కార్పోరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. అనంతరం పిల్లలతో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ బోట్ల విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బడిలోనే చేర్పిస్తాం

తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన

పాఠశాల ఉపా ధ్యాయుడు చంద్రారెడ్డి

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈ విద్యా సంవత్సరంలో తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పిస్తామని పిల్లల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. శుక్రవారం మండలంలోని పస్రా గ్రామంలో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పస్రా పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి బడిబాట కార్యక్రమం పట్ల వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారని ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వస్తున్న స్పందన అనూహ్యంగా ఉందని పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు రామరాజు, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శనివారం జూన్ 08, 2024 www.navatelangana.com

ఆ పాదముద్రలు టైగర్‌వి కావు

నిర్ధారించిన పారెస్ట్ అధికారులు

ఊపిరి పీల్చుకున్న ప్రజలు

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని కొయ్యూర్ సెక్షన్, జంగిడిపల్లి బీట్ పరిధి అడవిలోని చిన్న తరహా బొగ్గుల వాగు ప్రాజెక్టు సమీపంలోని గోపయ్యకుంట వాగులో చిరుత పులి సంచారం చేసిందని, టైగర్ పాదముద్రలు గుర్తించామని స్థానికులు కొందరు ఫొటోస్ సోషల్ మీడియాలో పెట్టడమే కాకుండా కొయ్యూర్ పారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొయ్యూర్ రేంజర్ కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు అప్రమత్తమైన తాడిచెర్ల సెక్షన్ అధికారి లక్ష్మన్, కొయ్యూర్ సెక్షన్ అధికారి ఇంతియాజ్, బీట్ అధికారులు వనజ, శ్రీకాంత్, విష్ణు, మహేందర్, నరేశ్ తదితరులు జంగిడిపల్లి బిట్ పరిధిలోని అడవుల్లో సుమారు నాలుగు గంటపాటు,12 కిలోమీటర్ల మేర చిరుత ముద్రణలు, ఆనవాళ్ల కోసం జల్లెడ పట్టారు. కానీ ఎక్కడా టైగర్ సమాచారం చేసినట్లుగా ఆనవాళ్లు కనిపించలేదని, మత్సకారులు, స్థానికులు శుక్రవారం ఉదయం గోపయ్య కుంటవాగులో గుర్తించిన పాదముద్రనలు తోడేలువని నిర్ధారణ చేసినట్లు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రజలు,పశువుల కాపర్లు ఎవరు ఆందోళన చెందొద్దని సూచించారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి.జి.పి.యస్.సి.) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీ సుశాఖ తరపున అన్నిరకాల భద్రత ఏర్పాట్లు చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. శుక్రవారం ఆయ న విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 17 సెంటర్లలో మొత్తం 4473 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేప ట్టామని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని అన్నారు. అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతి ఇస్తారని, 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని అన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు కలర్ ఫొటో, ఒరిజి నల్ ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/ఉద్యోగి గుర్తింపు కార్డ్/ఓటర్ గుర్తింపు కార్డ్ ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని అన్నారు. హాల్ టికెట్ నందు ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లైతే 3-కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్ పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని రావాల్సి ఉంటుందని అన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌కు ప్లాపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవాలి

గిరిజన జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్

నవతెలంగాణ -కోల్ బెల్ట్

సింగరేణి యాజమాన్యం గిరిజన ఉద్యోగుల సంక్షేమం పట్ల దృష్టి సారించాలని ఇటీవల నియమితులైన జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఏరియాను సందర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన ఉద్యోగుల నాయకులతో, అనంతరం ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్, ఎస్ఓటు జీఎం కవీంద్ర, డీజీ ఎం (పర్సనల్) అజ్మీర తుకారం, వివిధశాఖల, గనుల ముఖ్య అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన ఉద్యోగుల రిజర్వేషన్ల అమలుపై, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై , వారికి అందుతున్న బెనిఫిట్స్, ప్రమోషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఉద్యోగులకు విధులలో ఎటువంటి ఆటంకాలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణాల పని చేసేలా యాజమాన్యం వారి సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం చీఫ్ లైజన్ ఆఫీసర్ కష్ణయ్య, నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌రావు, రమేష్(ఐఈడి ఇంజినీర్), బానోత్ కర్ణ (ఫారెస్ట్ ఆఫీసర్), డివైపిఎం శ్యాంప్రసాద్, లైజన్ ఆఫీసర్ సీహెచ్. రమేష్, మోహన్, శంకర్, హేమ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నీరుగారుతున్న 'ఆత్మ పథకం'

రెండేండ్లుగా నిధుల్లేవ్...

నవతెలంగాణ-మల్హర్‌రావు

రైతులకు ఆధునిక పద్దతుల్లో సాగు చేయడంపై అవగాన వ్యవసాయ సాంకేతిక సంస్థ టఆత్మ పథకానికి) రెండేళ్లుగా నిధులు మంజూరు కావడం లేదు. దీంతో క్షేత్ర స్థాయి పర్యటనలు, విజ్ఞాన్ కిసాన్ మేళాల నిర్వాహణ నిలిచిపోయింది. ఆత్మ కార్యక్రమాల నిర్వహణకు 2023లో మండల వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపిన నిధులు మంజూరు కాలేదు. 2023-24, 2024-25 ప్రతిపాదనలు పంపాలనే ఆదేశాలు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రాలేదని సమాచారం. దీంతో ఆత్మ పథకం కొనసాగుతుందో లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన సదస్సులు కరువు

ఆత్మ పథకంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో రైతుల కోసం వివిధ కార్యక్రమాలు చేపడతారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన వెంటనే నూతన సాగు పద్ధతులలో అవగాహన కార్యక్రమాలతోపాటు శిక్షణ ఇస్తారు. వ్యవసాయ క్షేత్రాలకు రైతులను తీసుకెళ్లి వారిలో సాంకేతికతను పెంపొందిస్తారు. ప్రధానంగా విజ్ఞాన యాత్రలు, పద్ధతులపై సీడీల ద్వారా అవగాహన కల్పిస్తారు. మార్కెట్‌లో వచ్చే నూతన వంగడాల గురించి వివరిస్తారు. మండల స్థాయిలో విత్తనోత్పత్తి, చీడ, పీడ పురుగుల నివారణ పట్ల రైతులకు అవగాహన కల్పిస్తారు. మొత్తంగా 24 రకాల కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం నిధులు లేక రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి సమావేశాలు నిర్వహించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మండలంలో ఎక్కువగా వ్యవసాయం, వ్యవసాయా ఆధారిత పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు. కొద్ది మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. మామిడి, సొరకాయ, పుచ్చకాయ తదితర తోటలున్నాయి. ఏటా 15 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తారు. మత్స్యకారులు చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపడుతున్నారు. కాగా రైతులకు ఆధునిక విధానంపై అవగాహన లేక పాత పద్ధతులు అవలంభిస్తూ అధికంగా నష్టపోతున్న పరిస్థితి. ఈ క్రమంలో ఆత్మ పథకం ద్వారా అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందని, ఇప్పటికైనా ఆత్మ సంస్థకు నిధులు కేటాయించాలని మండల రైతులు కోరుతున్నారు.



నిధుల కేటాయింపు ఇలా...

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2018-19	3,00,000	1,70,444.
2019-20	13,50,000	8,50,000
2020-21	12,57,000	12,25,000
2021-22	10,70,457	10,70,457
2022-23	11,52,000	11,52,000.
2023-24,2024-25	నిధులు కేటాయించలేదు.	

నిధులు కేటాయించాలి

ఆత్మ పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. రెండేళ్లగా నిధులు కేటాయించకపోవడంతో పథకం నీరుగారిపోతోంది. రైతులను చైతన్య పరచకపోవడంతో పాత పంటలను సాగు చేస్తున్నారు.రైతులకు అవగాన కల్పిస్తూ ఆధునిక పంటల సాగు వైపు మరలించాల్సిన అవసరం ఉంది.

- అక్కల బాపు, రైతు సంఘం నాయకుడు

'రైతు చైతన్యం' ఏదీ ?

అటకెక్కిన 'మన తెలంగాణ-మన వ్యవసాయం'

పంట సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతియేటా నిర్వహించే రైతు చైతన్య యాత్రలు నాలుగేళ్లుగా నిర్వహించడం లేదు. దీంతో పంటలపై రైతులకు అవగాహన కొరవడింది. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు,భూసార పరీక్షలు,ఏపంటలు వేయాలి, అధిక దిగుబడి సాధించేందుకు మెలకువలపై అవగాహన కల్పించకపోడంతో రైతన్నలు నష్టపోతున్నారు నాలుగైదు రోజుల్లో వానాకాలం సాగు ప్రారభం కానుండగా ప్రభుత్వం రైతు చైతన్య యాత్రల గురించి ఎలాటి చర్యలు తీసుకోవడం లేదు.



నవతెలంగాణ-మల్హర్‌రావు

మల్హర్‌రావు మండలంలో 15 గ్రామపంచాయతీల పరిధి 22 రెవెన్యూ గ్రామాల్లో ఖరీఫ్ సాగులో 24వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయునున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వరి 16,000, పత్తి 3,500, మిర్చి 2,500, ఇతర పంటలు 1500 ఎకరాల్లో సాగుచేయునట్లుగా అంచనా వేశారు.వీటికి యూరియా, డిఎపి, కాంప్లెక్స్, ఎంవోపి తదితరులు ఎరువులు 6,890 మెట్రిక్ టన్నుల అవసరం ఉంటాయని పేర్కొన్నారు. గతంలో పంటలకు తెగుళ్లు సోకి రైతులు నష్టపోయారు.అయితే అప్పటి ప్రభుత్వం మన తెలంగాణ.. మన వ్యవసాయం పెరిట చైతన్య యాత్రలు నిర్వహించి రైతులకు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో సదస్సులు నిర్వహించేవారు. అయితే అవి ఇప్పుడు కనుమరుగైయ్యాయి. రైతులు మార్కెట్ లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి పంట మార్పిడి చేసుకోక భూసార పరీక్షలు చేసుకోక నష్టపోయిన దాఖలాలున్నాయి. గతేడాది మండలంలో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు నాటి అవి మొలకెత్తక దాదాపు 150 ఎకరాల్లో పంటలు నష్టపోవడం జరిగింది.నకిలీ విత్తనాలు మొలకెత్తక, ఇతర పంటలు సాగు చేసుకోవాల్సి వచ్చింది. రైతు చైతన్య యాత్రలు నిర్వహించి, నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలో వాటిపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

సూచనలు పాటించాలి

గతంలో మన తెలంగాణ.. మన వ్యవసాయం పేరిట రైతు చైతన్య యాత్రలు నిర్వహించడం జరిగింది.ప్రస్తుతం అలాంటివి నిర్వహించడం లేదు.గ్రామాల్లో అందుబాటులో ఉండి రైతు వేదికల్లో రైతులకు అవగాన నిర్వహించడం జరుగుతుంది.సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

-అత్తె సుధాకర్, మండల వ్యవసాయ అధికారి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
శనివారం జూన్ 8, 2024 www.navatelangana.com

నేత్రదానంతో జీవితానికి సార్థకత

నవతెలంగాణ-కాశిబుగ్గ

సామాజిక బాధ్యతతో నేత్రదానం చేసి జీవితాన్ని సార్థకత చేసుకోవాలని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోనేరెడ్డి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని అమరావతినగర్‌కు చెందిన చలువల కష్టమ్మ (85) అనారోగ్యంతో మరణించగా ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణుడు లక్ష్మణ్ ద్వారా కష్టమ్మ నేత్రలను సేకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కష్టమ్మ తాను మరణిస్తూ మరో ఇద్దరు అంధులకు చూపునిచ్చి అమరజీవిగా నిలిచిందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు కతజ్ఞతలు



తెలిపి నేత్రదాన సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో కష్టమ్మ కుటుంబ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ప్రతినిధులు శంకర్‌రావు, యాదవ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

డీఆర్డీఏ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమరయ్య

నవతెలంగాణ-పర్వతగిరి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్డీఏ ఇల్లంద క్లస్టర్ కోఆర్డినేటర్ గోలి కొమరయ్య అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ ఐక్య సంఘాల ప్రతినిధులకు పచ్చదనాన్ని పెంచు పర్యావరణాన్ని పరిరక్షించు అనే నినాదంతో నిర్వహించిన అవగాహన సదస్సులో కొమరయ్య పాల్గొని మాట్లాడారు. ముందుగా ఉప్పరపల్లి-వరంగల్ ప్రధాన రహదారిపై మహిళలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్మాస్టర్ వేణు, పంచాయితీ కార్యదర్శి దేవేందర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్లు కట్ట రజిత, భవాని, వీవో ప్రతినిధులు అనిత, యాకలక్ష్మి, సునీత, సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి, సరోజన కారోబార్ సారయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తిరుపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందజేత

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేసేందుకు శుక్రవారం ఎంపీపీ బాదావత్ విజేందర్, ఎంపీడీవో గోవిందరావు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎంఈవో రత్నమాలకు అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ప్రభాకర్‌రావు, భద్రయ్య, రవీందర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, కొమురయ్య, యాకయ్య, కట్టస్వామి, అనిల్, కష్టమూర్తి, ప్రజాప్రతినిధులు గోపాల్‌నాయక్, రమేష్, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు, మండల సమైక్య సిబ్బంది, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

జులై 7న లక్షలాది మంది మాదిగలతో కవాతు

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ జిల్లా కేంద్రంలో జులై 7న లక్షలాది మందితో మాదిగల కవాతు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం 18వ డివిజన్ ప్రతాప్‌నగర్ అంబేద్కర్ కమిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించగా మంద కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి





నవతెలంగాణ-నెక్కొండ

బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి సదా నందం కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండోరోజు నెక్కొండలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మనుగడకు, ప్రభుత్వ పాఠశాలలోనే ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, డ్రెస్సుల పంపిణీతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల విద్యా బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్స హించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు జాన్‌నాయక్, ఉపాధ్యాయులు ఐలయ్య, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, జీపీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతగిరి : నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని గోపనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ బృందం ఇంటికి తిరుగుతూ విద్యార్థుల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉభయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జె.లింగమూర్తి, టి.పూర్ణచందర్‌రావు, ఏపీసీ చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, ఎండీ అబ్దుల్ గఫార్, కె. ప్రణయ్‌కుమార్, వాసవి, దామోదర్, జి.రమేష్, జి. కరుణాకర్, ఎండీ ఫరీద్, కె.శ్వేత, సదానందం, ఎల్.శ్రీధర్, అంగన్వాడీ టీచర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రైవేట్ బడి వద్దు-ప్రభుత్వ బడి ముద్దు అనే నినాదం తో శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం జెడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానో పాధ్యాయుడు పాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటింటి ఉపాధ్యాయులు వెళ్ళి ర్యాలీ, ప్రచారం నిర్వ హించారు. మండలంలోని ఇస్లావత్ తండ గ్రామంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఇస్లావత్‌తండా గ్రామ మాజీ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్. ప్రధానోపాధ్యాయుడు ఎం డి మోసీన్. అంగన్వాడీ ఆయా పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా చివరి సర్వసభ్య సమావేశం

మండల సభలతో
పరిష్కారం కానీ ప్రజా సమస్యలు
అధికారుల తీరుపై నిలదీసిన వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండలంలోని పలు గ్రామాలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి మూడు నెలలకొసారి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మండల సభలు ఏర్పాటు చేస్తుంది. అయితే ఈ మండల సభలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. పాత చింతకాయ పచ్చడి లాగా అదే సమస్యలు మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి. సమస్యలు మాత్రం పరిష్కారం కాక మళ్ళీ వచ్చే సమావేశం నాటికి సమస్యలు ఎదురు చూస్తున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య చివరి సమావేశం ఎంపీపీ బాదావత్ విజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ముందుగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ పనితీరును నివేదికల రూపంలో చదివి వినిపిస్తున్న క్రమంలో మండల వైస్ ఎంపీపీ కంది కష్టారెడ్డి పంచాయతీ స్పెషల్ ఆఫసర్ల తీరుపై నిలదీశారు. గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోవడమే కాకుండా సమస్యలు పెరుగుతున్నాయి తప్ప ఎలాంటి ఫలితం లేదని సభలోనే బహిరంగంగా విమర్శించారు. కొన్ని సమస్యలు సంవత్సరాల తరబడి పేరుకుపోయిన ఏ మాత్రం అధికారులు పట్టించుకోవడంలేదని వైస్ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పున్నారని ఆయన ఘాటుగానే విమర్శించారు. అనంతరం ఎంపీడీవో గోవిందరావు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పదవికాలం ముగిసిన నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్లు గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దష్టి సాధించి అభివద్ధికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తినాయక్, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీధర్‌రాజు, వైద్యాధికారి సరోజ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-మంగపేట

తల్లి దండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన మండల కేంద్రంలోని పొదు మూర్‌కు చెందిన ముగ్గురు పిల్లలకు శుక్రవారం ప్రజా సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుడివాడ శ్రీహరి రూ.2వేల ఆర్థిక సాయం, 25కిలోల బియ్యాన్ని అందించారు. రెండు నెలల క్రితం మండలంలోని జబ్బోని గూడెం గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఎండీ యాకుబ్ మతి చెందాడు. కాగా భర్త చనిపోయిన బాధని తట్టుకోలేక అతని భార్య రేష్మి కూడా చనిపోయింది. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు.

ఈ విషయం తెలుసుకున్న శ్రీహరి శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా పిల్లలను పరామర్శించి 25కిలోల బియ్యం, రూ.2వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండేటి రాజు యాదవ్, ఖరీం, ముప్పారపు సందీప్, సాధనపల్లి రవి, శ్రీను, యాకూబ్, గార అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేయూత

రూ.3వేల ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి



కాటాపూర్ గ్రామానికి చెందిన గాండెర్ల శంకర్ అనే ఆటో డ్రైవర్ పేద కుటుంబం కావడంతో వారి కుమా రుడు అనారోగ్యం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబం, కొడుకు ఆనా రోగ్యంతో ఉండి వైద్యం పొందు తుండగా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ననిగంటిగంటి శ్రీకాంత్‌రెడ్డి ఒక కానిస్టేబుల్‌ను హాస్పిటల్‌కు పంపించి మెరుగైన వైద్యం అందించేలా వైద్యులతో మాట్లాడి, ఖర్చుల కోసం రూ.3000వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి ఆటో యూని యన్ నాయకులు ధన్య వాదాలు తెలిపారు.